‘స్త్రీశక్తి’ నిర్మాణానికి మోక్షం కలిగేనా !

- ఇప్పటికే రెండుమార్లు మంజూరై వెనక్కి మళ్లిన నిధులు
- మహిళా సంఘాల సమావేశాలకు తప్పని ఇక్కట్లు
- అరకొర వసతులతో అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది


కేతేపల్లిలో స్త్రీశక్తి భవన నిర్మాణానికి పన్నెండేళ్ల క్రితం వేసిన శిలాఫలకం


అరకొర వసతులున్న అద్దె భవనంలో నడుస్తున్న మండల సమాఖ్య కార్యాలయం

కేతేపల్లి: కూలీలకు పని కల్పించే ఉపాధిహామీ పథకం.. పేద మహిళలకు పొదుపు ద్వారా ఆర్థిక స్వాలంబన కల్పించే ఇందిరా క్రాంతి పథం.. ఈ రెండు శాఖల పాలన ఒకే గొడుగు కిందకు తెచ్చే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ నిర్మాణ్ రాజీవ్‌గాంధీ సేవా కేంద్ర భవనం పేరిట స్త్రీశక్తి భవనాలకు రూపకల్పన చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మండల కేంద్రాల్లో ఒక్కో భవనం నిర్మాణానికి రూ.25 లక్షల చొప్పున 2010లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. జిల్లా అంతటా ఈ భవనాలు శరవేగంగా పూర్తయి ఆయా శాఖల నిర్వహణను నూతన భవనాల నుంచే కొనసాగిస్తున్నారు. కానీ కేతేపల్లి మండలంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ రెండుమార్లు నిధులు మంజూరైనా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

వెనక్కి మళ్లిన నిధులు

కేతేపల్లిలో స్త్రీశక్తి భవన నిర్మాణానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2011లో అప్పటి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్ శంకుస్థాపన చేశారు. అనంతరం భవన నిర్మాణానికి అధికారులు ముగ్గు పోసి వదిలేశారు. ఏళ్లు గడిచినా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. స్త్రీశక్తి భవనానికి అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి (2016–17లో) రూ.32 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణానికి స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రతిపాదనలు చేశారు. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణ పనులకు 2017 జనవరిలో మరోసారి శంకుస్థాపన చేశారు. నాడు మండలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమం కూడా నిర్వహించలేదు. ఇలా రెండోసారి కూడా నిధులు వెనక్కి వెళ్లిపోయాయి దీంతో పదిహేనేళ్లకు పైగా మండల సమాఖ్య కార్యాలయం అరకొర వసతులు ఉన్న అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

అద్దె భవనంలో అవస్థలు

కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, ఆవాస గ్రామాల పరిధిలో 8,680 మంది సభ్యులతో 865 సమభావన సంఘాలు, 25 సంఘబంధాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని సభ్యులకు పొదుపు చేసుకోవడం, బ్యాంకు నుంచి రుణాలు పొందడం, తిరిగి వాటిని చెల్లించడం తదితర అంశాలపై ఐకేపీ సిబ్బంది ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే సొంత భవనం లేకపోవడంతో అరకొర వసతులు ఉన్న అద్దె భవనంలోనే మండల సమాఖ్య కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఐకేపీ సిబ్బంది చాలీచాలని గదుల్లో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి స్త్రీశక్తి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి మరోసారి ప్రతిపాదనలు పంపించాలని మహిళా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

సమావేశాల నిర్వహణకు ఇబ్బందిగా ఉంది



ఐకేపీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం. ప్రతినెలా మహిళా సంఘాల సభ్యుల సమావేశాల నిర్వహణకు ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో ఇబ్బందిగా ఉంది. ఈవిషయాన్ని గతంలోనే ఎంపీడీఓ కార్యాలయ అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–బి.యాదమ్మ, ఐకేపీ ఏపీఎం,కేతేపల్లి

క్లుప్తంగా

నేడు నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

నల్గొండ క్రైమ్ : హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణ కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించే ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- మునుగోడు నుంచి వచ్చే వాహనాలను ఈద్గా నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ వైపు మళ్లిస్తారు.
- దేవరకొండ నుంచి వచ్చే వాహనాలు డీఈఓ ఆఫీసు నుంచి నటరాజ్ థియేటర్ మీదుగా బస్టాండ్ వైపు వెళ్లాలి.
- పానగల్ నుంచి నల్లగొండ పట్టణంలోకి వచ్చే వాహనాలను రామాలయం దగ్గర నుంచి బోయవాడ మీదుగా బస్టాండ్ వైపు వెళ్లాలి.
- మైసయ్య విగ్రహం నుంచి ప్రకాశం బజార్‌కు వచ్చే వాహనములు బస్టాండ్ సమీపం నుంచి బీటీఎస్ రోడ్డు వైపు వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి నల్లగొండ పట్టణం వైపు, నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనములు ఎన్టీఆర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకు వన్ వేలో వెళ్లవలసి ఉంటుందని ఎస్పీ తెలిపారు. వాహనదారులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు హనుమాన్ విజయ యాత్ర

రామగిరి(నల్లగొండ): భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ విజయ యాత్ర నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు రాయల కృష్ణయ్య తెలిపారు. సోమవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలోని పాతబస్తీ హనుమాన్ ఆలయం నుంచి పుర వీధుల గుండా వీటీ కాలనీ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. హనుమాన్ భక్తులు, స్వాములు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట భజరంగ్‌దళ్ ప్రాంత కన్వీనర్ కన్నెబోయిన వెంకట్, వీహెచ్‌పీ సహ కార్యదర్శి జూకురి సంపత్, యలిజాల నరసింహ, వంశీ, రామలింగయ్య, శివరామ్ దీక్షిత్, నాగార్జున కౌశిక్, సురేపల్లి వెంకన్న, దాసరి క్రాంతి, సముద్రాల సన్ని తదితరులు ఉన్నారు.

ఆపదలో ఆదుకున్న వ్యక్తికి సన్మానం

చిట్యాల: రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితితో ఉన్న వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు సోమవారం సన్మానించారు. వివరాలు.. చీరాల జనార్దన్, చీరాల కృష్ణయ్య హైదరాబాద్ నుంచి బైక్‌పై నార్కట్‌పల్లికి వెళుతుండగా చిట్యాల పట్టణంలోని భువనగిరి ఎక్స్ రోడ్డులో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో బైక్‌పై వెనక కూర్చున్న పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన చీరాల జనార్దన్ తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. ఇదే సమయంలో అక్కడి నుంచి వెళుతున్న గ్రీన్ గ్రో స్కూల్ డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి వెంటనే జనార్దన్‌కు సీపీఆర్ చేయడంతోపాటు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తన కారులో తీసుకెళ్లాడు. జనార్దన్ ప్రాణాన్ని కాపాడిన విషయం తెలుసుకున్న చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు సోమవారం జూలకంటి వేణుగోపాల్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.


ఆరోపణలు చేయడం తగదు

నల్లగొండ టూటౌన్ : మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి జగదీష్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి సోదరులు అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, జగదీష్‌రెడ్డిపై అసత్యాలు, బూతు మాటలు మాట్లాడడం సరైంది కాదన్నారు. నేడు ఎంపీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ వేయనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు చామకూరి లింగస్వామిగౌడ్, కొమ్ము కోటేష్, మెండు విశాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శంకర్, రవి, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : మేడే ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎండీ. సయిద్, సుమతమ్మ, దోటి వెంకన్న, డి.వెంకన్న, ఎండీ. జాని, శంకర్, గుండె రవి, వెంకట్ రాముడు, కోట్ల సుభాష్, వి.లెనిన్, మల్లయ్య, వెంకటయ్య, అమీర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


మేకల భిక్షం

చిట్యాల: పట్టణానికి చెందిన మేకల భిక్షం ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతడి కుమారుడు మధు సోమవారం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. భిక్షం గురించి సమాచారం తెలిసినవారు 8499937990, 8309086933 నంబర్లకు తెలియజేయాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

చండూరు(గట్టుప్పల్): భూతాపాన్ని తగ్గించడానికి, పర్యావరణ పరిరక్షణకు విరివిరిగా మొక్కలు నాటాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాంనాయక్ అన్నారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి వేడెక్కకుండా మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సాయిరాం, నరసింహ, రాణి, మల్లేశం, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండారు వెంకటమ్మకు నివాళి


బండారు వెంకటమ్మ

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ మాతృమూర్తి వెంకటమ్మ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. వెంకటమ్మ మృతదేహాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పిల్లి రామరాజు యాదవ్, బొజ్జ నాగరాజు, కంకణాల నాగిరెడ్డి, పెరిక మునికుమార్, తదితరులు నివాళులర్పించి బండారు ప్రసాద్‌ను పరామర్శించారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో ఎద్దు మృతి !

నాంపల్లి : వెటర్నరీ డాక్టర్ నిర్లక్ష్యంలో తన ఎద్దు మృతి చెందిందని మండల కేంద్రానికి చెందిన నాంపల్లి సత్తయ్య ఆరోపించారు. తన నాలుగు సంవత్సరాల కోడె(ఎద్దు)ను చికిత్స నిమిత్తం సోమవారం స్థానిక వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు బిజీగా ఉండడంతో రిటైర్డ్ అయిన అటెండర్ వచ్చి ఎద్దుకు వైద్యం చేయడంతో ఎద్దు మృతి చెందిందని రైతు ఆరోపించారు. ఈ విషయమై అసిస్టెంట్ డాక్టర్ శ్రావ్యను వివరణ కోరగా.. రైతులు ఎద్దును కింద పడవేసి పట్టుకునే క్రమంలో గొంతుకు తాగు బిగుసుకుని ఎద్దు చనిపోయిందని తెలిపారు.

బెస్ట్ ట్రైనర్ అవార్డు అందుకున్న రవికుమార్

మిర్యాలగూడ టౌన్ : ఇంపాక్ట్ ఇంటర్నేషన్ సర్టిఫికేట్, బెస్ట్ ట్రైనర్ అవార్డును పట్టణానికి చెందిన రవికుమార్ అందుకున్నారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జడ్జి డివికె తేజో కార్తీక్ ఆ అవార్డును రవికుమార్‌కు అందజేశారు.

108 ఉద్యోగులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు

నల్లగొండ టౌన్: నల్లగొండలోని 108 విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ఈఎంటీ జి.వెంకటేశ్వర్లు, పైలెట్ ఎం.వెంకటేశ్వర్లు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులతోపాటు ప్రశంసా పత్రాలను జీవీకేఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ హెడ్ ఎంఏ ఖలీద్, డైరెక్టర్ ఎం.వెంకటేశం చేతుల మీదుగా అందజేశారు. అవార్డులు అందుకున్నందుకు నల్లగొండ జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ నజీర్, ఎగ్జిక్యూటివ్ మహమూబ్, రహీంలు ఉద్యోగులను అభినందించారు.


అవార్డు అందుకుంటున్న ఉద్యోగులు

ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలవాలి

- భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్


చిట్యాల : బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

చిట్యాల: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ప్రజలంతా మద్దతుగా నిలిచి గెలిపించాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి బూర నర్సయ్యగౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బూత్‌స్థాయిలో పార్టీ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పార్టీలో చేరినవారిలో చిన్నకాపర్తి మాజీ ఎంపీటీసీ ఆకుల వెంకన్న, బయ్య రవి, కొండ సాయి, చొల్లేటి బ్రహ్మచారి, ఈరమల్ల భిక్షపతి, ఈరమల్ల యాదయ్య, ఈరమల్ల బాలరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ చిట్యాల మున్సిపాలిటీలోని 104వ పోలింగ్ బూత్‌లో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ విజయం సాధిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె వెంకన్నగౌడ్, కన్నెబోయిన మహాలింగం, చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, విడుదల మల్లేష్, పాల రవివర్మ, జిట్ట విష్ణు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బెక్కంటి గణేశ్‌తోపాటు మరో 50 మంది సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి వర్షిత్‌రెడ్డి శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నరసింహ, భాస్కర్‌రావు, శివకుమార్, లింగస్వామి, సత్తయ్య, మేడబోయిన శ్రీను, వడ్డగోని రామలింగం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక


నార్కట్‌పల్లి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


నల్లగొండ: పార్టీలోకి ఆహ్వానిస్తున్న నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ మండలం దోనకల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

నార్కట్‌పల్లి : గోపలాయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గోసుల భద్రాచలం, మాజీ ఉప సర్పంచ్ యాట సైదులు సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం భద్రాచలం మాట్లాడుతూ త్వరలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 26నుంచి 28వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు మిర్యాలగూడ నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక రాజీవ్ గాంధీ స్టేడియం బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి నల్లగొండ యూత్ ఆధ్వర్యంలో బాక్సింగ్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. బాలికల విభాగం నుంచి ఎల్. లావణ్య, ఆర్. సాయి ప్రణీతి, కె. అంజలి, శ్రీకావ్యరెడ్డి, బాలుర విభాగంలో ఎస్. సుమంత్, ఎస్. సాయిచరణ్, మహ్మద్అలీ, మహ్మద్ అమీర్, ఎస్‌కె వసీమ్, ఎస్. విశ్వనాథంలు వివిధ విభాగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి మగ్బుల్ అహ్మద్, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రవీందర్ అభినందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక వసతులు ఏర్పాటు

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మౌలిక వసతుల ఏర్పాటు చేశారు. గతంలోనే రూ.50 లక్షల నిధులతో ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించినప్పటికీ ప్రయాణికులు రాక బోసిపోయింది. కేవలం ఆర్టీసీ బస్సులు వచ్చి వెళుతున్నాయే తప్ప ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను వినియోగించుకోవడం లేదు. మరోవైపు నీటి సరఫరా కనెక్షన్ ఇవ్వలేదు. నీటి కోసం ట్యాప్‌లు అమర్చలేదు. దీంతో మరుగుదొడ్లు వినియోగంలోకి రాకుండా పోయాయి.


బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రం ఏర్పాటు

వేసవి కాలం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు నకిరేకల్ బస్టాండ్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లకు ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ప్రారంభించారు. జనరల్ స్టోర్ కూడా ఏర్పాటు చేశారు. మెయిన్ సెంటర్ నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌లోకి రావాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

అన్ని వసతులు కల్పించాం

ప్రస్తుతం నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్‌లో అన్ని రకాల వసతులు కల్పించాం. హైదరాబాద్ వెళ్లే ప్రతి బస్ నకిరేకల్ బస్టాండ్‌కు వచ్చి వెళుతుంది. ప్రయాణికులు మెయిన్ సెంటర్‌లో ఎండకు దుమ్ముకు ఇతర వసతులు లేక ఇబ్బంది పడే కన్నా నేరుగా బస్టాండ్‌కు వచ్చి ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి .

–సురేందర్, సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్

ఉద్యాన రైతులను ఆదుకోవాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి


దెబ్బతిన్న మునుగ తోటను పరిశీలిస్తున్న చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ రూరల్: అకాల వర్షానికి నష్టపోయిన ఉద్యాన పంటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని కొత్తపల్లిలో కౌలు రైతు శ్రవన్ సాగు చేస్తున్న మునగ తోట అకాల వర్షానికి పూర్తిగా నేల కూలింది. ఈ సందర్భంగా చాడ కిషన్‌రెడ్డి సోమవారం తోటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన మామిడి, నిమ్మ, బొప్పాయి, దానిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష తదితర పంటలతోపాటు కూరగాయలు సాగు చేసిన రైతులకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలి డిమాండ్ చేశారు. అకాల వర్షానికి నష్టపోయిన తోటలను మంత్రి పరిశీలించకపోవడం దారుణమన్నారు. ఎండిన పండ్ల తోటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కల్వకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగయ్య, శ్రీకాంత్ రెడ్డి, లతీఫ్, వెంకన్న, శంకర్‌రెడ్డి, సైదిరెడ్డి, కట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల పోరాటంతోనే ‘ఉపాధి’ చట్టం


కేతేపల్లి: ఉపాధి హామీ కూలీలలో మాట్లాడుతున్న నాగయ్య


నకిరేకల్ : చీమలగడ్డలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

కేతేపల్లి: వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా వ్యవసాయ కార్మికుల వలసల నివారణ కోసం 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని తీసుకువచ్చిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. సోమవారం కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చినట్లయితే ఉపాధిహామీ పథకాన్ని పూర్తిగా రద్దు చేస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన గత పదేళ్లుగా ఏటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కుదిస్తూ ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తోందని అన్నారు. ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథక రక్షణ కోసం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి చింతపల్లి లూర్థుమారయ్య, నాయకులు కోట లింగయ్య, నాగమ్మ, పద్మ, యాదగిరి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది సీపీఐఎం

నార్కట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నివాసం ఉన్నచోటే పని కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి సీపీఐఎం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని సీపీఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి పెద్దచెరువులో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలను సోమవారం సీపీఎం కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, మండల కమిటీ సభ్యులు సన్నేసాబ్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రచారం

నకిరేకల్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం నకిరేకల్‌లోని చీమలగడ్డలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, సాకుంట్ల నర్సింహ, వంటెపాక కృష్ణ, చిన్నబాబు, చింతల వెంకన్న, చిన్నబోయిన నాగమణి, బుడిగె పాపయ్య, ఈశ్వరమ్మ, రేణుక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగదేవమ్మ జాతర


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


జాతరలో భేరీలు మోగిస్తున్న యువకులు

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో సోమవారం గంగదేవమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యాదవులంతా బోనాల గంపలతో మల్లన్న గుట్ట సమీపంలో ఉన్న ఆలయం వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని డప్పు, వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బోనాల్లో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని దేవతను వేడుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు యాటలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో మహిళలు, యువకులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చిట్యాల: అకాల వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర అందించాలని చిట్యాల మండల రూరల్ సీపీఎం కార్యదర్శి అర్రూరి శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వెలిమినేడు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యాన్ని సోమవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అర్రూరి శ్రీను మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రైతులు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని అధికారులను కోరారు. ఆయన వెంట సీపీఎం మండల నాయకుడు నెల్లికంటి నర్సింహ, గ్రామశాఖ కార్యదర్శి పంది నరేష్, రైతు సంఘం నాయకులు సుర్కంటి బుచ్చిరెడ్డి, దేశబోయిన నర్సింహ, నల్ల బుచ్చిరెడ్డి, యంపల్ల లచ్చిరెడ్డి, సుర్కంటి పాపిరెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని శేరిగూడెంలోని అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, పుష్పలత, లోకేశ్వరి తదితరలున్నారు.

శానంపూడిని కలిసిన డ్వాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శానంపూడి సైదిరెడ్డిని సోమవారం డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు కలిసి బోకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట డ్వాబ్ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.


బొకే అందజేస్తున్న పానుగోటి చొక్కారావు

చండూరు కవులకు సత్కారం


కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చండూరు: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం రాత్రి తెలంగాణ కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో చండూరు సాహితీ మేఖల సభ్యులు, తెలుగు భాషోపాధ్యాయులు మద్దోజు సుధీర్ బాబు, డాక్టర్ ఇడికుడ సచ్చిదానంద పాల్గొని తమ కవితలు వినిపించారు. అనంతరం సుధీర్ బాబు సచ్చిదానందలకు నిర్వాహకులు సుతారపు వెంకటరమణ, అనుముల ప్రభాకరాచారి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ సాహితీవేత్తలు కొలకలూరి ఇనాక్, సుధామ, విహారి, గిరిజా మనోహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.